## క్లుప్తంగా

### బ్యాంకింగ్‌లో శిక్షణ.. ఉద్యోగావకాశాలు

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా నెల రోజులపాటు ఉచిత శిక్షణనిచ్చి అనంతరం బ్యాంకుల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డిగ్రీ పూర్తయి 26 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు ఏప్రిల్ 8లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 12న ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహించే పరీక్ష ఫలితాల ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని స్టడీసర్కిల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి, 040-29303130 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని అజ్మీరా తండా గ్రామ పంచాయతీ పరిధిలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాతా దేవాలయంలో ధజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో లైవ్ రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేశ్‌నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌నాయక్, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదన్ నాయక్, గ్రామ పెద్దలు కిషన్ నాయక్, ప్రవీణ్ నాయక్, అమృతలాల్, సంతోష్ నాయక్, వినోద్ నాయక్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న రిలే దీక్షలు

ఇల్లంతకుంట: పెద్ద లింగాపూర్‌లో చేస్తున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలు గ్రామాల మహిళా రైతులు పాల్గొని నిరసన తెలిపారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన కాలువ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పయ్యావుల రాజమణి, అనిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అవగాహన

ఇల్లంతకుంట: ఇల్లంతకుంటలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంక్ మేనేజర్ రమేశ్ యాదవ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా బ్యాంకింగ్ సేవలను ప్రజలు సులభంగా నిర్వహించుకోవచ్చన్నారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా మోసపోకుండా ఉండేందుకు సైబర్ సెక్యూరిటీ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు.

### జాతీయ సైన్స్ దినోత్సవం



తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం బండి ఉపేందర్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బూట్ల శ్రీనివాస్, గట్టు శ్రీకాంత్, తిరుపతి, జ్యోతిరాణి, శ్రీనివాస్, రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని నందీశ్వర ఫంక్షన్‌హాల్‌లో 2011–2014లో డిగ్రీ చదివిన వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కళాశాల డైరెక్టర్లు విష్ణు, శ్రీనివాస్, రాజు, తదితరులు ఉన్నారు.

### ఆరుతడి పంటలు సాగుచేయాలి

రుద్రంగి: యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలని డీఏవో అఫ్జల్‌బేగం రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పంట పొలాలను పరిశీలించారు. ఎంఏవో దుర్గరాజు, ఏవో ప్రియదర్శిని, ఏఈవోలు జ్యోతి, వెంకటేశ్, రైతులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లిలో మండల వ్యవసాయ అధికారిని జయ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ... వరి పంటలో అక్కడక్కడ మొగిపురుగు, చీడపురుగుల నుంచి పంటలు కాపాడేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఇక్కడ ఏఈవో రమణరావు, మండల నాయకులు, దేవేందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### పశువుల పాక దగ్ధం

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లికి చెందిన రైతు పీరాల వెంకటేశ్ పశువుల పాకకు షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పు అంటుకుంది. అందులో ఉన్న గేదె, దూడ మంటల్లో తీవ్రంగా గాయపడ్డాయి. గమనించిన చుట్టుపక్కల వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



సిరిసిల్లలో పేరుకుపోతున్న చెత్త



బీవైనగర్‌లోని 34వ వార్డులో..



బీవైనగర్ 34వ వార్డులో బోరు పక్కనే చెత్తకుప్ప

## చెత్తపై చిత్తశుద్ధి ఏదీ.!

సిరిసిల్ల: స్వచ్ఛ సిరిసిల్లగా జాతీయస్థాయిలో రెండుసార్లు అవార్డు దక్కింది. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే పట్టణంలో చెత్తపై చిత్తశుద్ధి కరువైంది. పట్టణంలోని బీవైనగర్ పెద్ద కార్మిక క్షేత్రం. ఇక్కడ నేత కార్మికులు, పేదలు ఎక్కువగా నివాసముంటారు. 34వ వార్డులో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా పేరుకుపోతుంది. నిత్యం ఆటోలు, ట్రాక్టర్లతో తడి, పొడి చెత్తను సేకరించే కార్మికవాడలో ఇలా ఎక్కడ పడితే అక్కడే.. చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పురపాలక సంఘ పాలకవర్గం పదవికాలం ముగిసింది. ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతుంది. క్షేత్రస్థాయిలో పట్టించుకునే వారు లేక.. పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటి (ఆస్తి) పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ చెత్త తొలగింపుపై లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించాలి

బోయినపల్లి: మండలంలో (ఎల్‌ఆర్‌ఎస్)భూముల క్రమబద్ధీకరణ చేసుకోవడానికి అర్హులు ముందుకు రావాలని, దీనిపై పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించాలని డీపీవో షర్ఫొద్దీన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎల్ఎఆర్‌ఎస్ అమలు తీరును బుధవారం పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో 467 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఆమోదించినట్లు తెలిపారు. ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకునేవారు ఈనెల 31లోగా ప్రతీ దరఖాస్తు దారునుంచి వందశాతం ఫీజులు చెల్లించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని డీపీవో సూచించారు. ఎంపీవో శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, కారోబార్ నాగరాజు తదితరులు ఉన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న డీపీవో

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన

వీర్నపల్లి: మండలకేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఇన్‌చార్జి ఎంపీడీవో వాజిద్ ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇంటింటా అవగాహన కల్పించారు. 2020లో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మార్చి 31, 2025 లోగా క్రమబద్ధీకరించి ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అలరించిన అంధుల సంగీత విభావరి



సిరిసిల్ల: జిల్లాకేంద్రంలో బుధవారం రాత్రి అంధుల సంగీత విభావరి అలరించింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సూర్యానగర్‌కు చెందిన అంధులు శంకర్, అనిత, శ్రీనివాస్, వెంకటేశ్‌లు భక్తిగీతాలు, సినిమా పాటలు పాడుతూ.. ఆకట్టుకున్నారు. అంధుల సంక్షేమానికి దాతలు స్వచ్ఛందంగా డబ్బులు అందించారు.

### పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రజిత

ముస్తాబాద్ : మండలంలోని పోతుగల్ పీహెచ్‌సీని బుధవారం జిల్లా వైద్యాధికారి రజిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించారు. నూతనంగా మారిన భవనంలో వసతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. వేసవిలో కూలీలు, ముఖ్యంగా ఉపాధిహామీలో పనిచేసేవారు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కలుషిత నీటి సరఫరా, పైపులైన్ల లీకేజీ వంటి వాటిని పరిశీలించి సూచనలు చేయాలన్నారు. వైద్యాధికారి గీతాంజలి, ప్రోగ్రాం ఆఫీసర్లు అనిత, డాక్టర్ రామకృష్ణ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

### ప్రత్యేక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న రాజురావు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్‌కుమార్ డిమాండ్‌చేశారు. బుధవారం సిరిసిల్లలో వేర్వేరుగా నిర్వహించిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలన్నారు. సమావేశాల్లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎనకంతుల శ్రీనివాస్, నాయకులు గౌతమ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, ఉపాధ్యక్షుడు పెండాల ఆదిత్య, నాయకులు దొంతి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

- అనుమానితుల అప్పగింత

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో ఇంటింటికీ తిరుగుతూ తాయొత్తులు కడతామని సంచరిస్తున్న ఇద్దరు అనుమానితులలో ఒకరిని గ్రామస్తులు బుధవారం పోలీసులకు అప్పగించారు. నామాపూర్‌లో తాయొత్తులు కడతామని ఇద్దరు వ్యక్తులు ఒక మహిళ ఇంటికి వెళ్లి పొగ వేయడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు ఇద్దరు యువకులను వెంబండించగా, ఒకరు పరారీ కాగా ఓ యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కర్నాటక నుంచి బతుకుదెరువు కోసం వచ్చామని, ఎవరినీ మోసం చేయడం లేదని సదరు యువకుడు చెప్పాడని ఎస్సై గణేశ్ తెలిపారు. వారి నుంచి పూర్తి వివరాలు సేకరించి పంపించివేశామన్నారు.

- ఎంఈవోకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదో తరగతి విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీపై బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ ఎంఈవో కృష్ణహరికి బుధవారం ఫిర్యాదు చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన ప్యాడ్లను విద్యార్థులకు అందజేయడం సరికాదన్నారు. ప్యాడ్ల పంపిణీ నిలిపివేయకపోతే ఆందోళన చేస్తామన్నారు.

- అదనపు చార్జీలు సరికాదు

సిరిసిల్లటౌన్: మల్టీపుల్ మీటర్ల పేరుతో సెస్ అధికారులు అదనపు చార్జీలు వసూల్ చేయడం సరికాదని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సమితి ఆధ్వర్యంలో గాంధీచౌక్ నుంచి నిరసన ప్రదర్శన చేపట్టి సెస్ కార్యాలయానికి తరలివచ్చి మాట్లాడారు. అనంతరం సెస్ అధికారులకు వినతిపత్రం అందించారు. కుసుమ గణేశ్, చిప్ప దేవదాస్, శ్రీరాముల వెంకటేశం, సిద్ధిరాలి సారయ్య, వెంగళ వెంకటేశం, బొల్లి సత్యనారాయణ, పాల్గొన్నారు.

- విజయవంతం చేయాలి

వేములవాడఅర్బన్: సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ముషం రమేశ్ తెలిపారు. కార్మికులు, ప్రజలు, పార్టీ సానుభూతిపరులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

- 'పది'పరీక్షలపై రాజకీయం వద్దు

ఎల్లారెడ్డిపేట: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మాజీ మంత్రి కేటీఆర్ స్మైల్ ఏ గిఫ్ట్ కార్యక్రమంలో భాగంగా ఇస్తున్న పరీక్షప్యాడ్లపై రాజకీయ చేయొద్దని బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు అఫ్సర్ ఉన్నీసా పేర్కొన్నారు. మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.

- ఎస్టీలపై వివక్ష ఎందుకు..

సిరిసిల్లకల్చరల్: ముస్తాబాద్ మండల పరిధిలో తమ సామాజిక వర్గానికి చెందిన లంబాడీలు పెట్టిన కేసు విషయంలో ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారని బంజారా సంఘం అధ్యక్షుడు సురేశ్‌నాయక్ ఆరోపించారు. తమకు చట్టపరమైన న్యాయం జరగాలని డిమాండ్‌తో డీఎస్పీని కలిశామని, జరగని పక్షంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆశ్రయిస్తామన్నారు.

- దళితుల మధ్య వైషమ్యాలు పెంచొద్దు

దళితుల మధ్య వైషమ్యాలను పెంచి పోషించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. ఓ విలేకరి సోషల్ మీడియాలో ప్రసారం చేసిన వార్తల కారణంగా దళితుల మధ్య విభేదాలు సృష్టించబడే అవకాశాలున్నాయన్నారు. పూర్తి సమాచారంతో వార్తల్ని విశ్లేషించడం మంచిదే కానీ సమాజంలో ప్రతిష్ఠ గల వ్యక్తులపేర్లను నేరుగా ప్రస్తావించడం మంచిది కాదని హితవు చెప్పారు.

- సీపీఎం పోస్టర్ ఆవిష్కరణ

బోయినపల్లి: జిల్లాకేంద్రంలో ఈనెల 16న నిర్వహించే సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని రూపొందించిన పోస్టర్‌ను మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి గురజాల శ్రీధర్, రామంచ అశోక్ కార్మికులు తదితరులు పాల్గొన్నార

- ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

రుద్రంగి: మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దయ్యాల నారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేసేంత వరకు గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3తో పాటు ఉద్యోగ నియామక ఫలితాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె లింగం, సింగారపు బాబు, దయ్యాల రమేశ్, ప్రధాన కార్యదర్శి సిద్దపెల్లి మురళి, గౌరవ అధ్యక్షుడు పర్శయ్య, కార్యదర్శులు చిట్టిపాక మల్లయ్య ఉన్నారు.

### ఉన్నతస్థాయిలో రాణించాలి

సిరిసిల్లటౌన్: విద్యార్థులు ఉన్నతస్థాయిలో రాణించాలని సిరిసిల్ల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. అనంతరం సూర్య ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో నిర్వహించి ఫుడ్ ఫెస్టివెల్‌ను ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, గడ్డం లతా భాస్కర్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్, జిల్లా అధ్యక్షులు అరుణ్, పాఠశాల కరస్పాండెంట్లు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### అఘోరి అరెస్ట్



అరెస్టు చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: వేములవాడ ఆలయానికి వస్తున్న అఘోరి నాగసాధును బుధవారం జిల్లా సరిహద్దులోనే పోలీసులు అడ్డుకున్నారు. తాను వేములవాడ ఆలయ దర్శనానికి వస్తున్నట్లు అఘోరి మందస్తుగానే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా అఘోరి ఆలయానికి చేరుకుంటే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనే నిఘావర్గాల సమాచారంతో పోలీసులు తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోనే బారికేడ్లు ఏర్పాటు చేసి అఘోరి కారును అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు, అఘోరి మధ్య వాగ్వాదం జరిగింది. అఘోరి కత్తితో తన చెయ్యిని కోసుకునేందుకు ప్రయత్నించింది. దీంతో చేసేదిమి లేక మహిళా పోలీసుల సహాయంతో అఘోరిని అరెస్టుచేసి పోలీస్ బస్‌లో హైదరాబాద్ వైపు తరలించారు. అఘోరి కారును సైతం టోచన్ సాయంతో లాక్కెళ్లారు. సిద్దిపేట–సిరిసిల్ల రహదారిపై ఈ తతంగం జరగడంతో అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు బెంబేలెత్తారు.

### బకాయిలు చెల్లించాలి

సిరిసిల్లటౌన్: ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. బుధవారం పార్టీ ఆఫీసులో మాట్లాడారు. జిల్లాలో దాదాపు 2 లక్షల మంది ఉపాధి కూలీలు ఉండగా వేసవి సీజన్‌లో కేవలం 64,000 మందికి మాత్రమే పని దొరుకుతుందన్నారు. పని ప్రదేశంలో కూలీలు ఎండవేడికి తట్టుకునేందుకు టెంట్లు వేయడం, నీళ్ల సౌకర్యం కల్పించడం, పనిముట్లు ఇవ్వడం పూర్తిగా బంద్ చేయడం సరికాదన్నారు. ఉపాధి చట్టం ప్రకారం 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసం లక్ష్మణ్, నాయకులు సోమ నాగరాజు, అజ్జ వేణు పాల్గొన్నారు.

### కామ దహన వేడుకలు



నారాయణపూర్‌లో కామదహనం చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో హోలీ సందర్భంగా బుధవారం రాత్రి కామ దహనం చేశారు. సీతా రామచంద్రస్వామి ఆలయంలో వేద పండితులు బీటుకూరి గోపాలచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు కాముని దహన కార్యక్రమాన్ని చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, మాజీ సర్పంచ్ నిమ్మ నారాయణరెడ్డి, నిమ్మ మల్లారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు మోతె మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు నిమ్మ సుధాకర్‌రెడ్డి, నిమ్మ అనిల్‌రెడ్డి, లింగాల జాన్, దొమ్మాటి రాజు, బత్తుల బాబు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ముసుగు తొలిగింది

సాక్షి స్పందన

ముస్తాబాద్: ఎన్నికల కోడ్ ముగిసినా దేశ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించకపోవడంతో 'కోడ్ ముగిసినా..ముసుగు తొలగలే' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పోతుగల్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి వేసిన ముసుగును బుధవారం ఎంపీవో బీరయ్య పంచాయతీ సిబ్బందితో ముసుగును తీసివేయించారు.



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ఆరోగ్య ఉపకేంద్రం భవనం కిటికీ అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసంచేశారు. ఉపకేంద్రం భవనానికి ఉన్న కిటికీ అద్దాలన్నింటిని ఆకతాయిలు ధ్వంసం చేశారని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఆరోగ్య కేంద్రం భవనానికి ప్రహరీ లేకపోవడంతో మందుబాబులు ఇక్కడే మద్యంతాగి సీసాలు పడేస్తున్నారని వాపోయారు

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : బీరయ్య
ఎంపీడీవో, ముస్తాబాద్, సెల్‌నెంబర్ : 9676973358.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

## వైభవంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకులు



కల్యాణానికి హాజరైన భక్తులు

చందుర్తి: మండలంలోని బండపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం శ్రీవారి మేలుకొలుపు, అభిషేకాలు, అగ్నిప్రతిష్ఠ పూజలు, ధ్వజాకుంభారాధన, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకులు కొదంగుల్లా శ్రీకాంతాచార్యులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామికల్యాణం వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలతోపాటు కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను కాసర్ల సురేశ్ రాజేశ్వర్‌రెడ్డి, మద్దిరాల సరస్వతి, సత్యనారాయణ , పల్లి సులోచ న మల్లేశం దంపతులు అందజేశారు. మాజీ సర్పంచ్ గడ్డం పద్మతిరుపతిరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు కొండ సత్తవ్వ లక్ష్మణ్‌గౌడ్, మాజీ సర్పంచ్ దంపతులు గడ్డం పద్మతిరుపతిరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు గడ్డం మంజుల తిరుపతిరెడ్డి, కోశాధికారి తాడి శెట్టి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ కటకం మల్లేశం, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ప్రముఖుల పూజలు

బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహరావు, వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిలుక అంజిబాబు, బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, జిల్లా కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, నియోజక వర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాకేశ్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు విజేందర్, కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులను ఘనంగా సన్మానించారు.

## ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి

- బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: పదేళ్లలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు తప్ప ఆది శ్రీనివాస్ గెలిచినప్పటి నుంచి ఏం చేశారో చెప్పాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు సవాల్ విసిరారు. బుధవారం తన నివాసంలో మాట్లాడారు. కేవలం తాము చేసిన పనుల వద్ద ఫొటోలు గిదుతూ ప్రజలను నమ్మించి మసిబూసి మారేడుకాయ చేస్తూ తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జిల్లాలోని అప్పర్ మానేర్, మిడ్ మానేర్, లోయర్ మానర్ డ్యామ్‌లను పునరుద్ధరించి ఒక్కో ప్రాజెక్టు కింద లక్ష ఎకరాలకు నీరు అందించేందుకు కృషి చేసింది నిజం కాదా అని అన్నారు. చెప్పిన పనులన్నీ కాగితాలకే పరిమితం చేయకుండా పూర్తి చేసేలా శ్వేతపత్రం విడుదల చేయాలని, పనులన్నీ చేయకుంటే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల్లోకి వెళ్లి వారిలో చైతన్యం తీసుకువచ్చి ప్రశ్నించేలా చేస్తామని పేర్కొన్నారు. నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, తుల ఉమ, రామతీర్థపు మాధవి, భవాని తదితరులు ఉన్నారు.

### నియామకపత్రాలు అందజేత



వేములవాడఅర్బన్: పట్టణ బీజేపీ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా అక్కపల్లి వివేక్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, అన్నం నర్సయ్య, కోశాధికారిగా వెంకటేశ్, కమిటీ సభ్యులుగా శివాని, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రాధిక, బీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా యశ్వంత్‌ను ఎన్నుకున్నారు. నియామకపత్రాలను అందజేసినట్లు పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ తెలిపారు.

### తహసీల్దార్‌కు వినతి

వీర్నపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ లక్పతి నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మారుతి రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు మాట్లాడారు. ప్రభుత్వం తొమ్మిదో ప్యాకేజీ పనులు పూర్తిచేసే వరకు పోరాటం చేస్తామన్నారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి రాయిని చెరువుకు రావాల్సిన పైప్‌లైన్ పనులను కంచర్ల అటవీప్రాంతంలో ఎందుకు నిలిపివేశారన్నారు. రాయిని చెరువు నింపితే మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలకు నీరందుతుందన్నారు. ఇక్క బీజేపీ నాయకుడు బండారి మహేశ్, భూక్య రమేశ్, నరేశ్, బానోత్ శ్రీనివాస్, మామిండ్ల మోహన్, అరవింద్ మల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

తంగళ్లపల్లి: అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్‌తో మాజీ సర్పంచులు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నిస్తారన్న సమాచారంతో పలువురు మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.